మోటరు బిగింపు..నీటి సరఫరా పునరుద్ధరణ

బొంరాస్‌పేట, మే 23: మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామంలో కాలిపోయిన బోరు మోటారును బాగుచేయించారు. కొడంగల్ డీఈఈ జయలక్ష్మి, ఏఈ శ్రీకాంత్ దీనిని పర్యవేక్షించినట్లు పంచాయతీ కార్యదర్శి ఆండాళ్ తెలిపారు. మూడు రోజుల కిందట పాత బోరుమోటర్ కాలిపోవడంతో కొత్తగా బోరుమోటారును కొనుగోలు చేసి శుక్రవారం బిగించి గ్రామానికి తాగు నీటి సరఫరాను ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి ఆండాళ్ తెలిపారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

దోమ, మే 23: మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో నెల రోజుల క్రితం అండర్ డ్రైనేజీ పైప్ లైన్ వేయగా మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్‌కు ఉన్న నల్లా కనెక్షన్‌లను తొలగించి వదిలేయడంతో తాగు నీటికి ఇబ్బంది ఎదురవడంతో పాటుగా అసంపూర్తిగా ఉన్న గుంతల్లో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించి మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్‌కు కనెక్షన్లను ఇప్పించి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ బుద్ధ ఎడ్యుకేషన్ అవార్డు గ్రహీతకు సన్మానం

బంట్వారం, మే 23: కోటపల్లి మండలం జడ్పీహెచ్ఎస్ ఎన్నారం పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ముక్తార్ అహ్మద్‌కి థాయిలాండ్‌లో జరుగుతున్న గోల్డెన్ బుద్ధ ఎడ్యుకేషనల్ అవార్డ్స్‌లో గ్లోబల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ లండన్ వారి తరపున గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ముక్తార్ అహ్మద్‌ను శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఎంఈవో చంద్రప్ప ఘనంగా సన్మానం చేశారు సన్మాన గ్రహీత ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ ఆయన ధారా ధామ్ శిక్షణ్ సంస్థ, దేవనాగరి ఉథ్థాన్ ఫౌండేషన్ సంస్థలలో 14 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని తెలిపారు. అందులో భాగంగా డాక్టరేట్ దక్కడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, శేఖర్, విశ్వేశ్వర్, ముత్యం రెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, నికాత్ ఉన్నిసా, గీత, పరమేశ్వరి, విష్ణువర్ధన్, నర్సింలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చోరీకి గురైతే ఆందోళన వద్దు

కులకచర్ల, మే 23: మొబైల్ వినియోగదారులు తమ మొబైల్ చోరీకి గురైతే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కులకచర్ల ఎస్ఐ రమేశ్ తెలిపారు. దొంగిలించిన మొబైల్‌కు సంబంధించిన ఐఎంఈ నంబర్‌ను తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ విధా నం ద్వారా మొబైల్ ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని, దీని ఆధారంగా మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత జూన్1న కులకచర్ల స్టేట్ బ్యాంకు దగ్గర మొబైల్‌ను దొంగిలించగా ఈ విషయంపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీపీఈఆర్ విధానం ద్వారా మొబైల్‌ను గుర్తించి బాధితుడు మహేశ్‌కు అందజేసినట్లు తెలిపారు.

తాండూరు కంది 59 లాంటి రకాల్ని ఎంచుకోవాలి

పెద్దేముల్, మే 23 : పెద్దేముల్ మండలంలోని రైతు వేదికలో వ్యవసాయ పరిశోధన కేంద్రం తాండూరు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ' కార్యక్రమంలో వానకాలం పంటల సీజన్‌కు ముందస్తుగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ కందిలో మేలైన నూతన రకం తాండూరు కంది 59 లాంటి రకాల్ని ఎంచుకోవాలని, వర్షాదార పంటల్లో అంతర పంటలను సాగు చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పవన్ మాట్లాడుతూ రైతులు ,విత్తనాలు , రసాయనాలు కోనుగోలు చేసినప్పుడు వాణిజ్య దుకాణాల నుంచి పూర్తి స్థాయి రసీదులు తీసుకోవాలని, వాటిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, ఏఈఓలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అందోళన

వికారాబాద్, మే 22 : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై మహేం దర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, మావో యిస్టు నాయకులను హతమారుస్తున్నారని ఆరోపించారు. రాజ్యాం గ హక్కులను కాల రాస్తున్న బీజేపీ ప్రభుత్వం తమ చర్యలను వెం టనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేశవరావును నిరాయుధిడిగా పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టు కథలల్లుతున్నారని, ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అటవీ సంపదను ఇతర దేశాలకు తరలించడంలో భాగంగానే ఆదాని, అంబానీలకు మూకు మ్మడిగా అడవిని, అడవిలో ఉన్న సంపదలను కట్టబెడుతున్నారని మం డిపడ్డారు. అందులో భాగంగానే ఈ నరమేధం జరుగుతుందని పేర్కొ న్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నారాయణపూర్, దంతేవాడ, బీజా పూర్, కొండగావ్, జిల్లాలతో పాటు తెలంగాణలో కర్రిగుట్ట తదితర అడవులను జల్లెడ పట్టి ఆదివాసీలను హననం చేయడం అత్యంత దుర్మార్గ చర్య అని అన్నారు. వెంటనే ఆపరేషన్ కగారును విరమిం చుకోవాలని, ఇప్పటికే మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటిం చినప్పటికీ శాంతి చర్చలు జరుపకుండా కేంద్ర బలగాలతో ఏకపక్షంగా కాల్పులు జరిపి హత్య చేయడం సరైనది కాదన్నారు. మోదీ ప్రభుత్వం పాకిస్తాన్ తో చర్చలు జరిపి యుద్ధాన్ని విరమించింది కానీ, స్వదేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడుతున్న మావోయిస్టులతో చర్చలకు మాత్రం సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, మల్లేశ్, యాదయ్య, దశరథ ఆనంద్, ప్రకాష్ , నర్సింహా లు, పెంటన్న, అనంతయ్య , మల్లేశ్ పాల్గొన్నారు

లగచర్ల పట్టా భూముల్లో సర్వే

రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

బొంరాస్‌పేట, మే 23 : దుద్యాల మండలం లగచర్ల గ్రామ పరిధిలోని పట్టాభూముల్లో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు తహసీల్దార్ కిషన్ నాయక్ తెలిపారు. లగచర్ల గ్రామ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడ కోసం రైతులు ఇచ్చిన పట్టాభూములలో సర్వే చేశారు. అటవీశాఖ అధ్వర్యంలో చెట్లు, మైనింగ్‌శాఖ అధ్వర్యంలో బావులు, బోరు బావులు, హార్టికల్చర్ శాఖ అధ్వర్యంలో తోటలు, ఎక్సైజ్‌శాఖ అధ్వర్యంలో ఈతచెట్లు, వ్యవసాయభూములు పాలాలలో ఉన్న ఇండ్లు, రేకులషేడులు వంటి ఇతర వస్తువులను రైతుల సమ క్షంలో పరిశీలించి వాటిని అధికారులు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, వివిధ శాఖల అధికారులు, దుద్యాల, బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ ఎస్ఐలు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో బోధించాలి

బొంరాస్‌పేట, మే 23 : మండల స్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు దుద్యాల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్‌పర్సన్ వీరేశం హాజరయ్యారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు తరగతి గదులలో నైపుణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటూ అనునిత్యం నూతన ఆలోచనలతో విద్యాబోధన చేయాలన్నారు.కార్యక్రమంలో విద్యాధికారి విజయ రామారావు, సెంటర్ ఇన్‌చార్జ్ రవీందర్‌గౌడ్,ఎంఆర్‌పిలు వెంకటయ్య, శంకరప్ప, ఉపాధ్యాయులు ఆశోక్, అస్మాసూల్లానా, అర్షియాబేగం, తేజస్వీని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ధారూరు, మే 23: విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించి ధారూరు మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఫండమెంటల్ లిటరసీ న్యూమారాసి తదితర వాటిపై శిక్షణ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా రిసోర్సన్ పర్సన్లు మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ బోధన విధానాలు పునఃచరణ విద్యార్థులకు ట్రైనింగ్ పొందిన అంశాలను వివరించినట్లు తెలిపారు. విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడం నేర్చుకోలన్నారు. పిల్లల ప్రగతి నమోదు, కనీస అభ్యసన సామర్థ్యాల సాధనను పెంచాలన్నారు. గ్రంథాలయం నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశం టైంమేనేజ్మెంట్ తదితర వాటిని పాటించాలని సూచించారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గంచెరువు నర్సరీ పరిశీలన

వికారాబాద్, మే 23 : మోమిన్‌పేట మండలం దుర్గం చెరువు గ్రామాన్ని ఎంపీడీవో విజయలక్ష్మీ శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా నర్సరీలో మొక్కల నిర్వహణ, పారిశుధ్యం, పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్యం సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించి రాబోయే హరిత హారం కార్యక్రమానికి సిద్ధం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ఆమెతో పాటు పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

నేడు తిరంగా యాత్ర

పరిగి, మే 23: ఆపరేషన్ సిందూర్ విజయంపై త్రివిధ దళాలకు వందనం పలుకుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు పరిగిలో తిరంగా యాత్ర నిర్వహించడం జరుగుతుందని తిరంగా యాత్ర నిర్వహణ సమితి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు పరిగి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి ప్రధాన వీధుల గుండా గాంధీ చౌక్ వరకు ఈ యాత్ర కొనసా గుతుందని, ప్రతి ఒక్కరు ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీవో గా బాధ్యతలు..

బొంరాస్‌పేట,మే 23 : బొంరాస్‌పేట మండలానికి పూర్తిస్థాయి ఎంపీడీవోగా వినోద్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఎన్ఎస్ హెచ్ఆర్‌డీ హైదరాబాద్ నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. అధికా రులు, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఇంచార్జీ ఎంపీడీవోగా ఉన్న వెంకన్‌గౌడ్ ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్‌శాఖ

ఫోన్ నంబర్లు మార్పు

ధారూరు, మే 23: ధారూరు మండల పరిధిలోని విద్యుత్ శాఖ ఫోన్ నంబర్లును మార్చినట్లు ఇన్‌చార్జి ఏఈ ప్రమోద్ సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధారూరు ఏఈ 8712469741, ధారూరు 33కేవీ సబ్ స్టేషన్ 8712469805, నాగారం సబ్ స్టేషన్ 8712469799, నాగసముందర్ సబ్ స్టేషన్ 8712469816, మధుసూదన్ పార్‌మెన్ 8712469781, పైన ఉన్న నెంబర్లు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఇంచార్జీ ఏఈ ప్రమోద్ సింగ్ రోరారు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

కొడంగల్, మే 23: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని 2016 డిసెంబర్ 6వ తేదీన అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో మాట్లాడడని, ఇప్పుడు ఆ మాటలను సాకారం చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మహాదేవుని ఆలయ ప్రాంగణంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మిగతా 11 రాష్ట్రాల్లో రజకులు ఓబీసీలుగా ఉండటం వల్ల అన్ని రంగాల్లో వెనుబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే మొదటిసారిగా బీసీల కులగణన చేశారని, అదే దిశగా సీఎం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి మిగతా రాష్ట్రాలకు ఆదర్శం కావాలని కోరారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్,జిలాల పర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో రజకుల సంక్షేమానికి 2 ఎకరాల భూమిని కేటాయించాలని, అధునాతన ధోబీఘాట్, మినీ ఫంక్షన్ హాల్, సంత్ గాడే బాబా ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు బాలప్ప, సంయుక్త కార్యదర్శి వెంకటప్ప, సీనియర్ నాయకులు సుందరప్ప, మెగులయ్య, శ్యామప్ప, నవీన్ భీమప్ప పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కులకచర్ల: పరీక్షాకేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

వికారాబాద్, మే 23 :ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గం టల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 975 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 916 మంది పరీక్షలు రాశారు. 59 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 200 మంది రాయాల్సి ఉండగా 187 మంది రాశారు. 13 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. మొత్తం 1175 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 1103 మంది రాశారు. మిగిలిన 72 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 88 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 78 మంది పరీక్షలు రాశారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 40 మంది రాయాల్సి ఉండగా 31 మంది రాశారు. 9 మంది విద్యార్థులు హాజరు కాలేదు. మొత్తం 128 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 109 మంది రాశారు. మిగిలిన 19 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్ నోడల్ అధికారి వివరించారు. **కులకచర్ల:** కులకచర్ల మండల కేంద్రంలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించినట్లు వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

పరిగి, మన్నెగూడ,వికారాబాద్‌కు

ఆర్డినరీ బస్సులు నడపాలని వినతి

పూడూరు,మే 23 : పరిగి, మన్నెగూడ,వికారాబాద్‌కు ఆర్డినరీ బస్సులు నడపాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు యు.బుచ్చన్న, ఎ.వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మన్నెగూడ నుండి పరిగి మద్యలో పూడూరు,చీలాపూర్,చిన్నబండతాండ, తిర్మలాపూర్, రాకంచర్ల, దేవనోనిగూడ, సోమన్‌గుర్తి, రంగపూరంల స్టేజీలు ఉన్నయన్నారు. పరిగి మన్నెగూడ రూట్లో ఒక్క ఆర్డినరీ బస్సు నడపకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు తెలిపారు. బీజాపూర్– హైదరాబాద్ హైవే రోడ్డుపై పరిగి నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు కోస్గి, కోడంగల్,పరిగి, కర్ణాటకలకు చెందిన వందల సంఖ్యలో ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే నడుపుతున్నట్లు తెలిపారు.
కాని ఈ రూట్లో ఆర్టీసీ ఒక్క ఆర్డినరీ బస్సు కూడ నడపడం లేదన్నారు. ఆర్డినరీ బస్సులు లేక పోవడంతో ఎక్కడికి వెళ్లాలన్న ఈ ప్రాంతాల ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదని తెలిపారు. రిక్వెస్ట్‌తో బస్సు ఆపినా మన్నెగూడ నుంచి పరిగి టికెట్ తీసుకోవల్సి వస్తుందన్నారు. ఇప్పటికైన ప్రయా ణికులకు సౌకర్యంగా ఉండేలా పరిగి, మన్నెగూడ, వికారాబాద్ వరకు ఆర్డినరీ బస్సులు నడపాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై

చర్యలు తీసుకోండి

బషీరాబాద్, మే 23 : ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు శ్రీనివాస్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గొట్టిగకలాన్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కొంత మంది వ్యక్తులు ఇంటి నిర్మాణాలు చేపట్టారని, అక్రమ నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చారన్నారు. ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిపై అనుమతులు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
LEASE REQUIRED
★సంవత్సరం లీజుకు 10 Acres to 15 Acres భూమి కావాలి. కొత్తూరు, షాద్‌నగర్, తిమ్మాపూర్ పరిసర ప్రాంతాలవారు 15 సంవత్సరాలు సంప్రదించండి: 9182757179
NT-342957
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన్ రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యూట్యూబ్‌లో ప్రకటనలు నమ్మొద్దు

బినోమో యాప్‌లో ట్రేడింగ్‌తో మోసం
ప్రైవేట్ ఉద్యోగికి రూ.2.32 కోట్లు టోకరా
నాలుగేండ్లు.. 434 ట్రాన్సాక్షన్స్‌లు

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): బినోమో పివోట్ ఇన్వెస్టింగ్ యాప్ నుంచి స్టాక్ ట్రేడింగ్‌లో మంచి లాభాలొస్తాయని యూట్యూబ్‌లో ప్రకటనను చూసిన నమ్మి స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ. 2.32 కోట్లు మోసపోయాడు. ఇంజాపూర్‌కు చెందిన బాధితుడు 2021 అక్టోబర్‌లో యూట్యూబ్‌లో బినోమో పివోట్ ఇన్వెస్టింగ్ యాప్ గూర్చి ప్రకటన చూసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో నుంచి ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు సంపాదించవచ్చంటూ దానికి తగిన మెలుకువలు, స్ట్రాటజీస్ గూర్చి వివరించారు. మొదట రూ. 2 వేలు పెట్టుబడి పెట్టి ప్రారంభించాడు. లాభాలు రావడంతో నెమ్మదిగా పెట్టుబడిని పెంచుతూ వచ్చాడు. యాప్ ద్వారా పెట్టుబడి పెట్టగా వచ్చిన లాభాలను తన పేటీఎం వ్యాలెట్ నుంచి విత్ డ్రా చేసుకుంటూ వచ్చాడు. రోజు వారీగా రూ. 5 వేల వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశమిచ్చారు. కొన్నాళ్ల తర్వాత ఇలా తక్కువ పెట్టుబడితే సంపాదన ఎక్కువ ఉండదని వీఐపీ ప్రైవేట్జ్ సభ్యత్వం తీసుకుంటే అందులో మీ డిపాజిట్లపై ఇన్సూరెన్స్ కూడా ఉంటుందంటూ నమ్మించాడు. దీంతో తన పెట్టుబడిని పెంచుతూ వచ్చాడు. అప్పటి నుంచి నష్టాలు రావడం ప్రారంభమైయ్యాయి. అక్కడి నుంచి కస్టమర్ కేర్ నుంచి ఫోన్ చేసి మీ స్ట్రాటజీ అలా కాదు. ఇంకా కొంత పెట్టుబడి పెట్టండి మీకు లాభాలు వస్తాయంటూ నమ్మిస్తూ పెట్టుబడిని లక్షల్లోకి తీసుకెళ్లారు. ఇలా సుమారు నాలుగు సంవత్సరాలలో 434 ట్రాన్సాక్షన్స్‌లతో రూ. 2,40,85,778 పెట్టుబడి పెట్టగా ఆరు సార్లు రూ. 8,24, 997 లాభంగా తిరిగి ఇచ్చారు. మొత్తంగా రూ. 2,32,60, 781 మోసపోవడంతో బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఫైనాన్స్ పేరుతో వసూళ్లు

వాహనాదారుడి వద్ద డబ్బులు వసూలు చేసిన దొంగలు

బండ్లగూడ, మే 23 : ఫైనా న్స్ ప్రతినిధులమని చెప్పి ఓ ద్విచక్ర వాహనం దారు డి వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూల చేసి పారిపోయిన దొంగలను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకా రం... మొయినాబాద్ మండలం కుతుబుద్దీన్‌గూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ బషీర్ ఈ నెల 20వ తేదీన తన బంధువుకు చెందిన షైన్‌బైక్‌పై అత్తాపూర్ నుంచి వెళ్తుండగా పిల్లర్ నెంబర్ 161 వద్ద ఇద్దరు వ్యక్తులు వచ్చి బైకును అడ్డగించారు. బషీర్‌తో ఈ బైక్ ఫైనాన్స్‌లో ఉందని చెప్పి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. డబ్బులు చెల్లించాలని లేదంటే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాదు కూడదంటే రూ.8 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
దీంతో బషీర్ మీ గుర్తుంపు కార్డులు చూపాలని అడగడంతో అతనిపై దాడి చేసి రెండువేలు కాచేశారు. అనంతరం బషీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు అత్తాపూర్ సిక్‌చావనికి చెందిన సర్దార్ హర్బజన్‌సింగ్, సచిన్ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కరెంట్ కనెక్షన్ కట్ చేస్తా మంటూ..

విశ్రాంత ఆర్మీ అధికారికి టోకరా

బంజారాహిల్స్, మే 23: కరెంట్ బిల్లు కట్టకపోవడంతో మీ కనెక్షన్ కట్ చేయాల్సి ఉంటుందంటూ కాల్ చేసి విశ్రాంత ఆర్మీ అధికారి వద్దనుంచి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే..జూబ్లీహిల్స్ రోడ్ నెం 10(సీ)లోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఆర్మీ అధికారి ఘన్‌శ్యామ్ పాండే(82)కు నెలరోజుల క్రితం మెసేజ్ వచ్చింది. కరెంట్ బిల్లు కట్టకపోవడంతో ఏక్షణంలో నైనా కనెక్షన్ కట్ చేస్తామంటూ మెసేజ్‌లో పేర్కొన్నారు. బిల్లు వివరాలు తెలుసుకునేందుకు ఫోన్ చేయాలంటూ ఒక నెంబర్ ఇచ్చారు. సదరు నెంబర్‌కు ఫోన్ చేసిన ఘన్‌శ్యామ్ పాండే తాను కరెంట్ బిల్లు చెల్లించానని చెప్పాడు. బిల్లుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు తాను పంపిస్తున్న లింక్ ద్వారా రూ.10 చెల్లించాలని ఆగంతకుడు చెప్పడంతో లింక్ ఓపెన్ చేయగా బ్యాంక్ ఖాతానుంచి రూ.46వేలు కాజేశారు. దీంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్న ఘన్‌శ్యామ్ పాండే సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదుచేయడంతో పాటు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు